చెప్పారు. మీ కోడలు మిమ్మల్ని తిడుతోంది అనుకోండి తిరిగి మీరు తిట్టటం మానేసి మీ పూర్వజన్మ పాపం కోడలు రూపంలో వచ్చింది అనుకోండి. నీవు ఎంజాయ్ చేయటం వలన ప్రారబ్ధం పోతుంది అని చెప్పారు. ఇష్టాయిష్టాలు తగ్గిపోతే మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది, చాపల్యం తగ్గేకొలది మీ సాధన తేలిక అవుతుంది. ఎవరిని చూసి మీరు ఇష్టపడుతున్నారో ఒకోసారి వారే అపకారం చెయ్యవచ్చు, ఎవరిని చూసి మీరు అయిష్టపడుతున్నారో ఒకోసారి వారే మీకు ఉపకారం చెయ్యవచ్చు, అది మనం చెప్పలేము. ఈ ఉపకారాలు, అపకారాలు గొడవ వదిలెయ్యండి. ఇంట్లో వారి ప్రేమలు కూడా కలుషితమైన ప్రేమలు. మీ కుటుంబ సభ్యులకు మీరు ఎక్కువ డబ్బు, ఆస్తి ఇచ్చినా ఒకోసారి వారు సంతోషించరు సరికదా ఇవ్వక ఏమి చేస్తాడు అంటారు. ఇదంతా దొంగ నేను యొక్క చేష్టలు. నీవు దాని వెంట పరుగుపెట్టవద్దు. నీవు ఏదైతే అవునో దాని గురించి శ్రవణం చెయ్యి, దానిని స్మరించు, దానిని మననం చెయ్యి, దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మీరు సబ్జక్టు గురించి మాట్లాడండి. సబ్జక్టు గురించి తప్ప ఇతర గొడవలు ఎవరైనా చెపుతూ ఉంటే బుడబుక్కల మాటలు మాట్లాడవద్దు అని చెప్పండి. ఏమీ మొఖమాటపడవద్దు. మీకు సబ్జక్టు ప్రధానం, ఆలోచన ప్రధానం. భక్తులైన మీకు అందరకు నా ప్రార్థన ఏమిటి అంటే సబ్జక్టు ప్రధానంగా, ఆలోచనే ప్రధానంగా జీవించండి. సబ్జక్టు గురించి తప్ప ఇతర మాటలు చెపుతూ ఉంటే మీరు వినవద్దు, పామును చూసి ఎలా పారిపోతారో అలాగ అక్కడ నుండి పారిపోండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-02-2007, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శివరాత్రి. భగవంతుని అవతారములలో ముఖ్యమైనవి శివుడు, కృష్ణుడు. శివకేశవులకు బేధం చూడకూడదు. ఇప్పుడు ఎవరైనా కృష్ణుడి విగ్రహం తెచ్చి ప్రక్కన పెట్టారు అనుకోండి, ఏమిటి కృష్ణుడిని తీసుకొని వచ్చి పెట్టారు అనుకోకూడదు, ఆ కృష్ణుడిలో కూడా శివుడినే చూడాలి. శివకేశవులకు బేధం లేదు. మన బుద్ధిలో ఉన్న దోషాలు పోతేగాని మనకు జ్ఞానం కలుగదు. అవి ఎప్పడో వేలాది జన్మల నుండి మనకూడా వస్తున్నాయి. శివనామం ఏమి చేస్తుంది అంటే మన బుద్ధిని కాలుస్తుంది అంటే మన బుద్ధిలో ఉన్న దోషాలను తొలగిస్తుంది. మన బుద్ధిలో ఉన్న దోషాలను తొలగించిన తరువాత మనకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అది శివనామం యొక్క ప్రత్యేకత. శివుడు అంటే ఎవరోకాదు మన హృదయంలో ఉన్న ఆత్మే శివుడు అంటే నిజమైన నేనే శివుడు. ఈరోజు పగలు ఉపవాసం

ఉండి, రాత్రి జాగరణం అంటే శివనామం స్మరించుకోవటం, శివుడి రూపాన్ని ధ్యానించుకోవటం, అది సాంప్రదాయం. ఉపవాసం వలన శరీరానికి ఆరోగ్యం, స్మరణ వలన మనస్సుకి ఆరోగ్యం వస్తుంది. మీలో కొంతమంది సాధన పేరు మీద చాలాకష్టపడుతున్నారు కాని బూడిదలో పోసిన పన్నీరు కింద అయిపోతోంది. మన పద్ధతి ఎలా ఉంది అంటే ఒక కాసు బంగారం హోటలుకు తీసుకొని వెళ్ళి ఇది మీరు పుచ్చుకొని మాకు ఒక కప్పు కాఫీ ఇమ్మనటం ఎలా ఉంటుందో, మనం సాధన చేసి భక్తిని సంపాదించి లోకం గొడవలలో ఉంటూ మాకు అది కావాలి ఇది కావాలి అని అడుగుతూ మీ శక్తిని వృధా చేసుకోవటం అలాగే ఉంటుంది. భగవంతుడు మనకు ఏది మంచిదో అది ఇస్తాడు. ఏదీ కోరి తెచ్చుకో కూడదు. మీరు ఏదీ భగవంతుడిని అడగవద్దు. అడిగితే మన భక్తి అక్కడికి పరిమితమై పోతుంది.

శరీరం పుట్టినది మొదలు, చనిపోయేవరకు ఎవడి జీవితం సమానంగా ఉండదు. ప్రారబ్ధం ప్రకారం శరీరయాత్ర జరిగిపోతూ ఉంటుంది. మనం దేహభావనతో పనులు చేస్తూ కర్తృత్వం పెంచుకోవటం, జన్మలు పెంచుకోవటం ఇదంతా మనకు ఆత్మజ్ఞానం లేకపోవటం వలన వస్తోంది. అహంకారం, మమకారం లేకుండా దేహాభిమానం రాదు. దేహాభిమానం నశించకుండా మీరు కోటి జన్మలు ఎత్తినా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మీలో కొంతమంది చాలా తెలివైనవారు ఉండవచ్చు. తెలివితేటలు, పాండిత్యం, మంచితనం ఇవన్నీ మంచివే. అంతమాత్రంచేత ఆత్మజ్ఞానం కలుగదు. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు యొక్క దయ లేకుండా ఎవరికి ఆత్మజ్ఞానం కలుగదు. మేము తెలివైనవారము, మేము మంచివారము అని అనుకొంటూ మీ నెత్తిమీద మీరే అక్షింతలు వేసుకొని పొంగిపోవటం. ఒకవేళ మీరు నిజంగా మంచివారు అయినా గురువు యొక్క దయలేకుండా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. స్వరూపంలో ఈశ్వరుడు, జీవుడు ఒక్కటే. అజ్ఞానం వలన, దేహాభిమానం వలన శివుడు వేరు, జీవుడు వేరు అనే భావన కలుగుతోంది. మీరు ఏ మతస్థులైనా, ఏ కులస్థులైనా, మీ గురువు ఎవరైనా దేహాభిమానం నశించకుండా జ్ఞానం కలుగదు. మనం అందరం ఈ భూమి మీదకు వచ్చాము. ఈ శరీరం భూమి మీద ఎంతకాలం ఉండాలో అంతకాలం ఈ బొమ్మను ఆడిస్తాడు, తరువాత తీసుకొని పోతాడు. అయితే ఈలోపు కష్టాలు వస్తాయి, సుఖాలు వస్తాయి, లాభం వస్తుంది, నష్టం వస్తుంది, సంతోషం వస్తుంది, దుఃఖం వస్తుంది, ఇవి అన్నీ అబద్ధమే. వీటితో తాదాత్మ్యం పొందవద్దు. మన శరీరం పుట్టినది మొదలు, చనిపోయేవరకు మనం చేసేపనులను, మనకు వచ్చే తలంపులను అన్నింటిని రికార్డు చేయటానికి ఒకడిని భగవంతుడు నియమించాడు. వాడే

చిత్రగుప్తుడు. ఇప్పుడు మనం చించినాడ వచ్చాము. ఎంతమంది శ్రద్ధగా వచ్చారు, ఎంతమందిలో జిజ్ఞాస ఉంది, ఎంతమంది కాలక్షేపం కోసం వచ్చారు, ఏదో పుణ్యం వస్తుంది కదా అని ఎంతమంది వచ్చారు ఇదంతా ఆయన రికార్డు చేస్తాడు. మనందరికి పెర్సనల్ ఫైల్స్ అక్కడ ఉంటాయి, ప్రతీదీ అందులో రికార్డు చేసి శరీరం మరణించిన తరువాత ఈ జీవుడు యమధర్మరాజు దగ్గరకు వెళ్ళినప్పుడు ఆ రికార్డు అక్కడ పెడతాడు. అప్పటివరకు ఆయన ఏమీ మాట్లాడడు. మనం చేసే మంచిని, చెడ్డను ప్రతీ దానిని రికార్డు చేస్తాడు. మనం ఆయనను ఇన్ఫ్లుయన్స్ చేయటం కుదరదు ఎందుచేతనంటే ఆయన మన కళ్ళకు కనబడడు.

సరస్వతీదేవిని ప్రార్థిస్తే బాగా చదువు వస్తుందని, లక్ష్మీదేవిని ప్రార్థిస్తే డబ్బు ఇస్తుందని, లేకపోతే దేవతలను ప్రార్థించటం వలన మనకు భోగాలు ఇస్తారు, మన కోరికలు తీరుస్తారు అని చెపుతూ ఉంటారు. కాని సుఖం అనేది ఈ సృష్టిలో జీవకోటిలోగాని, పంచ భూతాల్లోగాని, దేవతలలోగాని ఎక్కడా సుఖంలేదు. ముఖ్యంగా అది మనకు అర్థమవ్వటం లేదు. సుఖానికి మరొక పేరే ఆత్మ, సుఖానికి మరొకపేరే చైతన్యం. ఆత్మలో తప్పించి సుఖం బయట ఎక్కడా లేదు. అందుచేత ఎవడైతే ఆత్మజ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడే సుఖి అవుతాడు మిగతావాడికి ఎవ్వడికీ సుఖం అందదు. మనం ఆత్మజ్ఞానం గురించి శ్రవణం చేయగా చేయగా ఆత్మజ్ఞానం సంపాదించాలనే బుద్ధి మనకు కలుగుతుంది. కాని మనం దాని గురించి శ్రవణం చేయటంలేదు. పూర్వపుణ్యం లేకపోతే శ్రవణం చేయాలనే బుద్ధి కూడా మనకు కలుగదు. జిజ్ఞాస లేకుండా జ్ఞానం కలుగదు, జ్ఞానం లేకుండా ఎవడూ సుఖి అవ్వలేడు. జ్ఞానంలో తప్పించి సుఖం ఎక్కడా లేదు అని మనకు తెలియక దేవతలను ఏవో భోగాలు కావాలి అని అడిగేస్తాము, అడిగితే వారు ఇస్తారు. ఈ భోగాలు అన్నీ వచ్చే జన్మలో రోగాలుగా మారిపోతాయి, అది మనకు తెలియటం లేదు. ఒకోసారి భగవంతుడు మనకు అన్నీ ఇచ్చేస్తాడు. అన్నీ ఇచ్చినా మీరు వికారం లేకుండా ఉన్నారా అని చూసుకొంటాడు అన్నీ ఉన్నా మీరు వికారం లేకుండా ఉండగలిగితే ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. మనం గొప్పలకోసం పనులు చేయకూడదు. మనకు దేశభక్తి లేదు, దైవభక్తి లేదు. ఠాగూర్ ఒక పద్యంలో ఏమని వ్రాసాడు అంటే సూర్యుడు రోజూ ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు. అస్తమించేటప్పుడు సూర్యుడు అనుకొన్నాడట రేపు ఉదయం వరకు మనం రాము వెళ్ళిపోతున్నాము అయ్యో రేపు ఉదయం వరకు ఈ జీవకోటి అంతా చీకటిలో ఉండాలి, రేపు ఉదయం వరకు నా పని చేసిపెట్టేవారు ఎవరైనా ఉన్నారా అని సూర్యుడు అడిగాడట.

అప్పుడు ఒక కిరసనాయిలు దీపం ముందుకు వచ్చిందట. ఓ సూర్యభగవానుడా! నేను నీ అంతటి పెద్దవాడిని కాదు, నువ్వు ఎన్నో కోట్ల జీవరాశులకు వెలుతురు ఇస్తున్నావు కాని నేను ఇంతమందికి వెలుతురు ఇవ్వలేను. అలాగని అసలు వెలుతురు ఇవ్వకుండా ఉండను. నువ్వు కోట్ల మందికి వెలుతురు ఇస్తే పోనీ నేను నలుగురికైనా వెలుతురు ఇస్తాను, నువ్వు రేపు ఉదయం వచ్చేవరకు నేను ఉంటాను అని చెప్పిందట. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసింది ఏమిటి అంటే కిరసనాయిలు దీపం తన పాత్ర ఏదో తాను పోషించింది. మనం కృష్ణుడిలాగో, శివుడిలాగో పనిచేయలేకపోవచ్చు కాని కిరసనాయిలు దీపం లాగ మన పాత్ర మనం నిర్వర్తించాలి. మనం చేయగలిగిన పని మనం చేయాలి అది ఇక్కడ కిరసనాయిలు దీపం చెప్పేది. ఈ భూమి మీదకు వచ్చినందుకు మన పాత్ర ఏదో మనం నిర్వర్తిస్తూ, మనం చేసే పనులు చిన్న పనులు అయినా ఈశ్వరార్పణంగా చేస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము.

మనం కాలేజీలకు వెళుతున్నాము, గుడికి వెళుతున్నాము ఎందుకు వెళుతున్నాము, నేర్చుకోవటానికి వెళుతున్నాము. అంటే అక్కడ నుండి బయటకు వచ్చేటప్పుడు ఎంతోకొంత తెలివితేటలు పెంచుకొని బయటకురావాలి. ఇప్పుడు మీరు ఈ మీటింగులకు వస్తున్నారు అంటే ఎంతో కొంత మీరు బాగుపడాలి, వివేకం పెరగాలి, విచక్షణ పెరగాలి, మీ పనులు శ్రద్ధగా చేసుకోవాలి, ఇతరులు ఎవరైనా మిమ్మల్ని మోసం చేయటానికి ప్రయత్నం చేస్తే ఆ మోసంలో పడకూడదు, మీకాళ్ళ మీద మీరు నిలబడాలి అంతేగాని తెలివి తేటలు తగ్గించుకోవటానికి ఈ మీటింగులకు రావటం ఎందుకు? మిమ్మల్ని ఎవరినీ కట్రాడుకు కట్టేయటానికి ఇక్కడకు పిలవటంలేదు. ఈ మీటింగుల వలన మీరు ఎంతో కొంత బాగుపడాలి, మీ కుటుంబపోషణ చూసుకొంటూ ఎంతో కొంత సమాజానికి ఉపయోగపడే శక్తి మీకు రావాలి. సృష్టివేరు, దేవుడువేరు కాదు. దేవుడే సృష్టిరూపం ధరించాడు. మీరు ఎదుటిమనిషికి సలహా చెప్పేటప్పుడు, మీరు ఏ మనిషికైతే సలహా చెపుతున్నారో, ఆ మనిషి ఏ కష్టంలో ఉన్నాడో అదే కష్టంలో మీరు ఉన్నప్పుడు మీరు ఎలా ప్రవర్తిస్తారో ఆలోచించి అలాగ సలహా చెప్పాలి. మనం ఎక్కడికి వెళ్ళి చూసినా ఈ సృష్టిలో రెండే మనలను బంధించేవి 1. రూపబుద్ధి, 2. నామబుద్ధి. ఈ రెండింటిని మనం తేలికగా తీసుకొంటున్నాము, ప్రతీవాడు అనుకొంటాడు వాడి పేరు లోకం అంతా వ్యాపించి పోవాలి అని వాడికి జ్ఞానం అక్కరలేదు, ప్రజల సుఖం అసలే అక్కరలేదు. వాడికి పేరు వచ్చేయాలి. ప్రతీ మనిషికి ఒక శవం ఉంటుంది, ఆ శవానికి ఒక పేరు ఉంటుంది. ఇవి రెండూ నిజం

కాదు. నిజం కాని ఈ రెండింటిని పట్టుకొని కష్టపడి తిరుగుతున్నాడు సాధన చేస్తున్నాడు, ఫెయిల్ అవుతున్నాడు. మీరు ఇంటికి వెళ్లి ఆలోచించుకోండి. నేను చెప్పిన మాటలు నమ్మవద్దు. మిమ్మల్ని బలవంతంగా నమ్మించవలసిన పని నాకు లేదు. మిమ్మల్ని ఏదో రమణభక్తులగానో, శివభక్తులగానో చేసే పని మాకు లేదు, మీచేత ఓట్లు వేయించుకోవాలనే బుద్ధి మాకు లేదు. అందుకే భగవాన్ చెప్పేవారు అందరూ గజ ఈతగాళ్లే, ఎవడూ గజం కదలటం లేదు అని, ఈ రూపబుద్ధి, నామబుద్ధి తాచుపాము కంటే ప్రమాదమైనవి. తాచుపాము కరిస్తే పోనీ ఆ శరీరం పోతుంది. ఈ రూపబుద్ధి, నామబుద్ధిలోనుండి బయటకు రాకపోతే ఇవే కోటి జన్మలకు కారణం అవుతాయి. నేను ఏదో చెప్పటంకాదు, మీరు లోతుకు వెళ్లి ఆలోచించుకోండి. మీరు సుఖంగా లేరు, శాంతిగా లేరు ఇంక ఈ పేరు, రూపం ఏమి చేసుకొంటారు. ఈ నామరూపములను ఓవర్‌కమ్ చేయాలి. ఈ రూపబుద్ధి నుండి, నామబుద్ధి నుండి బయటకు రాలేరు అనుకోండి ఇంక మీరు గానుగుఎద్దులాగ తయారవుతారు. గానుగుఎద్దు మూడు గంటలు నడుస్తుంది, నేను చాలా దూరం వెళ్లిపోయాను అనుకొంటుంది, గంతలు విప్పేసాక గానుగ దగ్గరే ఉంటుంది. మనం కూడా అంతే. గానుగఎద్దు నడుస్తోంది, దాని తప్పు ఏమీ లేదు, కాని ఎక్కడ నడుస్తోంది గానుగ చుట్టూ నడుస్తోంది. అలాగే మనం రూపబుద్ధి, నామబుద్ధి చుట్టూ తిరుగుతున్నాము. రూపబుద్ధి, నామబుద్ధిలో నుండి జీవుడు బయటకు రాలేడు అనుకోండి వాడికి జ్ఞానంలేదు, మోక్షంలేదు, శాంతిలేదు, సుఖంలేదు. కొంతమంది పెద్ద పెద్ద చదువులు చదువుతారు, పిహెచ్‌డిలు ఉంటాయి, పెద్ద పెద్ద పదవులు చేస్తారుగాని రూపం, నామం వీటిని దాటలేరు. అందుకే ప్రహ్లాదుడు అన్నాడు చదువవలెను, చదువవలెను చావులేని చదువు చదువవలెను. రూపబుద్ధిని, నామబుద్ధిని దాటకపోతే ఎంతచదివినా అది వల్లకాటికే. చావులేని చదువు అంటే ఈ దేహం చనిపోతున్నా నేను చావు లేకుండా ఉన్నాను అన్న సంగతి నీకు తెలుస్తూ ఉంటుంది. నువ్వు రూపంగా ఉండవు, నువ్వు నామంగా ఉండవు, కాని ఉంటావు, నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తూ ఉంటుంది, అదే అమృతానుభవం. ఇంక వాడిని జన్మలు ముట్టుకోవు. మీరు సాధన చెయ్యండికాని గురువు అనుగ్రహం లేకుండా మటుకు మనోనాశనం అవ్వదు.

భగవంతుడు మీకు ఏ అవకాశములు అయితే ఇచ్చాడో వాటిని కొంతవరకు ఈ సృష్టికి కూడా ఉపయోగించండి. దానివలన ఆధ్యాత్మికంగా అభివృద్ధి కలుగుతుంది. భగవంతుడు మీకు ఏదైనా శక్తిని ఇచ్చాడు అనుకోండి దానిని మనం ఉపయోగించుకోవాలి కాని పాడుచేయకూడదు. మీ ఇంట్లో నలుగురికి సరిపడ మజ్జిగ ఉంది అనుకోండి. మీ

ఇంట్లో ఇద్దరే ఉన్నారు అనుకోండి, మిగతా ఇద్దరికి పనికి వచ్చే మజ్జిగ పెంటమీద పోయనక్కరలేదు, ఆ మజ్జిగ ఎవరికైనా ఇవ్వండి. ఒకవేళ నీద్వారా ఏదైనా మంచి జరిగింది అనుకో అది నేను సాధించాను, ఇది నేను సాధించాను అంటే అది తప్పలలో కెల్లా పెద్ద తప్ప అంటున్నారు భగవాన్. ఎందుచేతనంటే భగవంతుడే ఆ పనిని నీ ద్వారా చేయించాడు, లేకపోతే నువ్వు ఏమి చెయ్యగలవు, నీ వల్ల ఏమీ అవ్వదు. ఒకడు ప్రధానమంత్రి అయ్యాడు అంటే వాడి తెలివితేటల వలన కాదు. భగవంతుడు వాడిని అక్కడ కూర్చోబెట్టాలి అనుకొన్నాడు అంతే. నెగ్గినవారు అందరూ తెలివైనవారు అని కాదు, ఓడిపోయిన వారు తెలివి తక్కువ వారు అని కాదు. ఒక కెరటంలో నెగ్గుతూ ఉంటారు, ఒక కెరటంలో ఓడిపోతూ ఉంటారు, వారి తెలివితేటలతో సంబంధం లేదు, మనం అందరం విధి చేతులలో బొమ్మలం. మీరు అలాగ ఉండవద్దు, ఇలాగ ఉండవద్దు. మీరు ఎలాగ ఉన్నారో అలాగ ఉండండి. మేము అలాగ ఉన్నాము, మేము ఇలాగ ఉన్నాము అంటే ఈ శవాలు మిమ్మల్ని విడిచిపెట్టవు, పునర్జన్మలు విడిచిపెట్టవు. అసలు ఉండటం అంటే ఏమిటో మీకు అర్థమవ్వాలి. అప్పడు మీరు శాంతి సముద్రంలో, ఆనంద సముద్రంలో ఊగిసలాడతారు, అప్పడు మీకు దేహంతోగాని, లోకంతోగాని, దేవుడితోగాని పనిలేదు. నదికి వరద వచ్చినప్పడు గడ్డిపరక ఎంత వేగంగా కొట్టుకొని పోతుందో శివానుగ్రహం మీకు కలిగినప్పడు మీ బుద్ధిలో ఉన్న దోషాలు అంతవేగంగా బయటకు పోతాయి, అప్పడు జ్ఞానం అనే దుప్పటితో మిమ్మల్ని కప్పతాడు. వాడే శివుడు, వాడే నారాయణుడు, వాడే ఆత్మ.

అర్జునుడు అంతటివాడిని పట్టుకొని పరమాత్మ ఏమన్నాడు నువ్వు ఊరికే బొమ్మలాగ నిలబడు, చేతులు ఆడించు, నువ్వు ఎవరినైతే చంపుదామనుకొంటున్నావో వారినందరిని నేను చంపి పోగులుపెట్టి ఉంచాను అన్నాడు. అంటే ఎవరు పని చేసారు, నారాయణుడు చేసాడు. మనం ఏమనుకొంటున్నాము అర్జునుడు యుద్ధాలు చేసాడు అనుకొంటున్నాము. చేసింది నారాయణుడే, అర్జునుడి దేహాన్ని ఉపయోగించుకొన్నాడు అంతే. అలాగే లోకంలో మీ ద్వారా ఏవైనా మంచి పనులు జరిగితే మీరు చెయ్యటంకాదు, మీ దేహాన్ని భగవంతుడు ఉపయోగించుకొన్నాడు అంతే, అది మీకు అర్థమవ్వాలి. అది మీకు అర్థమైతే మీకు ఇంక ఆడంబరం రాదు. కృష్ణుడు అర్జునుడు చాలాకాలం కలిసి తిరిగారు. భగవద్గీత చెప్పేటప్పడు కూడా విశ్వరూప దర్శనం అయ్యేవరకు కృష్ణుడి యొక్క వైభవం ఏమిటో అర్జునుడికి అర్థం కాలేదు. ఆయనకే అర్థమవ్వనప్పడు మనకు ఏమి అర్థమవుతుంది. భగవంతుడు మనకు ఎంత వరకు తెలియబడితే అంతవరకు తెలుసుకోగలము కాని లేకపోతే మనం ఆయనను తెలుసుకోలేము. ఆయన సర్వశక్తిమంతుడు. ఆయన దయలేకుండా మనలో ఉన్న అజ్ఞానం

నశించదు. మీరు పవిత్రతను పెంచుకోండి, ఏకాగ్రతను పెంచుకోండి, బుద్ధిసూక్ష్మతను పెంచుకోండి, ఓర్పుగా జీవించండి. ఈ దైవీ సంపదనంతా మనం జాగ్రత్తగా సమకూర్చుకొంటే ఆత్మజ్ఞానం పొందటానికి అర్హత కలుగుతుంది. భగవంతుడు చేసే పనిని మేము చేస్తున్నాము అంటారేమిటి. భగవంతుడే చేస్తున్నాడు అనే గుర్తింపు కూడా లేని మీకు జ్ఞానం ఎలా వస్తుంది. భగవంతుడు చేస్తున్నాడు అని తెలియకపోవటం ఒక పొరపాటు, పైగా నేను చేస్తున్నాను అనుకోవటం ఇంకో పొరపాటు. ఈశ్వర ప్రణాళిక ప్రకారం ఇదంతా జరుగుతోంది. ఈ జీవకోటిని, పంచభూతాలను నియమించేవాడు ఆయనే. ఒక పురాణంలో ఏమని ఉందంటే నీవు అరుణాచలం, అరుణాచలం అని ఆ నామాన్ని ఒక్కసారి చేస్తే మూడు వేల కోట్ల శివనామం చేసిన ఫలితం వస్తుంది అని వ్రాసారు. మనం ఎక్కడ పొరపాటు చేస్తున్నాము అంటే భగవంతుడు చేసేది మనం చేస్తున్నాము అనుకొంటున్నాము, దాని వలన అజ్ఞానం పెరుగుతోంది. అన్నం వండేటప్పుడు గరిటను ఎలా ఉపయోగించుకొంటామో అలాగ భగవంతుడు మన శరీరాలను ఉపయోగించుకొంటున్నాడు అంతే, అది మీకు అర్థమవ్వాలి.

నాకు భక్తి కావాలి, భక్తిని పెంచుకోవాలని ఉంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే భక్తిని పెంచుకోవాలి అనే తపన నీకు ఉంటే, ఆ జిజ్ఞాస నీకు ఉంటే అదే జ్ఞానాన్ని తీసుకొని వస్తుంది. భగవదనుభవం పొందాలి అనే తలంపు నీకు వస్తూ ఉంటే, నీకు పూర్వపుణ్యం ఉంటే నీకు అటువంటి తలంపులు వస్తాయి గాని లేకపోతే రావు. నీకు ఎప్పుడైతే జిజ్ఞాస కలిగిందో ఎంతోకొంత ఆచరించాలనే బుద్ధి నీకు కలుగుతుంది, ఆచరణలో నుండి ఆత్మజ్ఞానం వస్తుంది. పూర్వజన్మలలో ఎంతోకొంత సత్కర్మ చేసి ఉంటే జిజ్ఞాస నీకు కలుగుతుంది కాని లేకపోతే రంపం పెట్టి కోసినా రాదు. ఇంతమంది భక్తులు సబ్జక్టు వింటున్నారు. మన భక్తులు ఈ సబ్జక్టు ఎందుకు వింటున్నారో నాకు తెలియటం లేదు. కొంతమంది పెళ్ళిళ్ళ విషయాలు మాట్లాడటానికి, ఏవో కుటుంబవిషయాలు మాట్లాడటానికి నా దగ్గరకు వస్తారు. తలుపులు వేసుకొని చెపుతారు, నాకు తోచిన సలహా నేను చెపుతాను. వారు తలుపులు వేసుకొని ఎందుకు చెబుతున్నారు అనే ఆలోచన కూడా వారికి ఉండదు. తలుపు సందులలో నుండి వినేవాళ్ళు ఉన్నారు. వారు ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడుకొంటున్నారు, అలా తలుపు సందులలోనుండి వినకూడదు అనే చిన్న విషయం కూడా తెలియని మీకు ఆత్మజ్ఞానం ఏమిటి? మిమ్మల్ని ఏదైనా సలహా అడిగితే చెప్పవచ్చు. వారు తలుపులేసుకొని ఏదో మాట్లాడుతూ ఉంటే సందులలో నుండి మీరు వినటం ఏమిటి? అందుకే భగవాన్ చెప్పారు ఇతరుల గొడవలలో కలుగజేసుకోవద్దు. ఇతరుల గొడవలలో కలుగజేసుకొంటే నీ పతనం ప్రారంభమవుతుంది. కొంతమంది భక్తులు ఎలా

ఉన్నారు అంటే వారి కుటుంబంలో గొడవ ఎవరికీ తెలియకూడదు, మిగతా వారి కుటుంబంలో ఏదైనా జరిగితే దేశమంతా తెలిసిపోవాలి. అంటే మనం అంత బుద్ధిమంతులం. ఇదే విషయం ఏసుక్రీస్తు చెప్పాడు. ఎదుటివాడి కంటిలో ఉన్న నలుసు నీకు కనపిస్తోంది కాని నీ కంటిలో ఉన్న దూలం నీకు కనబడటం లేదు. ఇప్పుడు మనం కలకత్తా వెళ్ళాలి అనుకొన్నాము అనుకోండి. కలకత్తా వెళ్ళే రైలు ఎక్కి కూర్చొంటే కొద్ది ఆలస్యం అయినా మొత్తంమీద కలకత్తాలో పడేస్తుంది. అసలు నీకు జిజ్ఞాస ఉంటే, భగవదనుభవం పొందాలి అనే తపన నిజమైతే అదే నిన్ను గమ్యానికి చేరుస్తుంది. భగవదనుభవం పొందటానికి నీకు ఏ మనస్సు అయితే అడ్డు వస్తోందో అది నీకు ఉన్న జిజ్ఞాసలో కరిగిపోతుంది. మనం వెలిగించిన వెంటనే హారతి కర్పూరం ఎలా హరించుకొనిపోతుందో అలాగ జిజ్ఞాసలో, జ్ఞానాగ్నిలో నీ మనస్సు కరిగిపోతుంది. నీ మనస్సు ఎప్పుడైతే కాలిపోయిందో అందులో ఉన్న బలహీనతలు, నీ పునర్జన్మ హేతువులు అన్నీ కూడ కాలి బూడిద అయిపోతాయి. నీ మనస్సు శేషం లేకుండా ఎప్పుడైతే కరిగిపోయిందో అప్పుడు నీలో ఉన్న ఆత్మ నీకు తెలియబడుతుంది. నీవు ఆత్మగా ఎప్పుడైతే మిగిలిపోయావో, నిలిచిపోయావో అప్పుడు ఇంక నీవు జీవుడవు కాదు, నీవు శివుడివే అంటే శివస్వరూపాన్ని పొందుతావు.

ఈ మీటింగు అయిపోయాక ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోయినట్లుగా ఈ శరీరాలు చనిపోయాక ఎవరి మార్గంలో వారు వెళ్ళిపోతారు. ఒక్కమాట మీరు బాగా గుర్తుపెట్టుకోండి. మేము కష్టాలు అనుభవిస్తున్నాము, మాకు నష్టం వచ్చింది, ఇలా ఎన్ని జన్మలు ఎత్తాము, ఎన్ని శవాలను మోసాము అని ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము కదా. మీ మనస్సు ఎప్పుడైతే వేరుతో సహా నశించిందో అప్పుడు, మీరు ఇప్పటివరకు అనుకొన్నవి అన్నీ అబద్ధాలు అన్న సంగతి మీకు స్ఫురిస్తుంది. అదే జ్ఞానం. అప్పుడు ఇంక పుణ్యపాపాలతో, లాభనష్టాలతో, జన్మలతో మీకు సంబంధం లేదు. మనం పీల్చుకొనే గాలి ఎంత స్వచ్ఛంగా ఉండాలి అని అనుకొంటామో మనం తినే ఆహారం ఎంత శుభ్రంగా ఉండాలి అని అనుకొంటామో అలాగే మనం చేసే స్నేహాలు కూడా అంత స్వచ్ఛంగా ఉండాలి అని కోరుకోవాలి. అప్పుడు మనకు చైతన్యస్థాయి పెరుగుతుంది. కాని స్నేహాల విషయం దగ్గరకు వచ్చేటప్పటికి మంచిస్నేహాలు చేయాలనే బుద్ధి మనకు రావటం లేదు. చదివే గ్రంథాలు, చేసే స్నేహాలు, పెరిగే వాతావరణం ఇదంతా ప్యూర్‌గా ఉంటే మనస్సుకు చాపల్యం ఆగిపోతుంది, హృదయంలో శాంతి కలుగుతుంది. మీకు ఏవైనా చెడుతలంపులు వస్తూ ఉంటే మొగ్గలోనే తుంచేయండి, చెట్టు అవ్వనివ్వవద్దు. చెట్లు అయితే మరల కొట్టటం చాలా కష్టం అవుతుంది, రంపాలు కావాలి. మొగ్గలో అయితే చేతితో తుంచేయవచ్చు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 13-03-07 శుక్ర | ఆనంద ఎస్టేట్, జువ్వలపాలెం రోడ్డు, భీమవరం |
| 18-04-07 బుధ | చిలుకూరు |
| 20-04-07 శుక్ర | ఆత్రేయపురం, తూ॥గో॥ జిల్లా |
| 25-04-07 మంగళ | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## నిజమైన ఆనందం

నది ఒక ఒడ్డు నుండి రెండవ ఒడ్డుకు చేరవేయుటకు పడవ ఎట్లు ముఖ్యమైన సాధనమో, జీవత్వమునుండి స్వరూపానందములోకి ప్రవేశించుటకు ఈ మానవజన్మ అంతే ముఖ్య సాధనము. నిజమైన ఆనందము భౌతిక విషయములలోను, వస్తువులలోనూ, ప్రపంచంలోనూ లేదు. అది స్వరూపంగానే వుంది. ఆనందము మనకన్న భిన్నమైన వస్తువు కాదు కాబట్టి ఆనందము కొరకై మనము చేసే ప్రయత్నము ద్వారా లభించదు. ఆనందం స్వరూపంగా వ్యక్తం కాకపోవుటకు కారణం దేహాత్మ బుద్ధియే! దప్పికతో ఉన్నప్పుడు శుభ్రమైన నీరు త్రాగుటమాని నీటిని గురించి ధ్యానించినట్లు ఉన్నాయి మన సాధనలు. నీరు త్రాగనంతవరకు దప్పిక తీరనే తీరదు. మన నిజ తత్త్వాన్ని మరచిపోవడం వల్ల అనగా దేహాత్మబుద్ధి వలన రాగద్వేషాలు, అసూయ, కోపము, మృత్యు భయము మున్నగు వికారాలకు లోనవుచున్నాము. నిజమైన ఆనందము దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతము, శాశ్వతము, ఆదిమధ్యాంతరహితము. అట్టి నిజమైన ఆనందాన్ని స్వరూపంగా అనుభవించాలంటే దేహాత్మ బుద్ధి నశించి తీరవలసిందే! దేహాత్మబుద్ధి నశించాలంటే మనలోని దుర్గుణాలను దూరం చేసుకొంటూ నిష్కామకర్మ, సజ్జన సాంగత్యముల ద్వారా మనస్సును పవిత్రం చేసుకోవాలి. దీనిలో అత్యంత కీలకమైనది గుర్వనుగ్రహము.

**చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

# సత్యానుభూతికి విచారణే మాస్టర్ 'కీ'

అంతులేని సుఖశాంతులు ఉన్న మన హృదయమనే పెట్టె తెరవాలంటే విచారణామార్గమే పెద్ద తాళం. అన్ని ఆధ్యాత్మిక మార్గాలు కన్న ఇది సూటి అయినది. దీనికి చాప, బల్ల అక్కరలేదు. సునిశితమైన, నిర్మల, కుశాగ్ర బుద్ధి సరిపోతుంది. మనలను ఎవరైనా "మీరు ఎవరు?" అంటే కులం పేరు, నివాసం వంటి అప్రధానమైనవి చెబుతాము. మూలమైన ఆత్మ స్ఫురణ మనకు రావటం లేదు. ఇదే పెద్ద మాయ. ఆత్మానుభవానికి ప్రధాన అవరోధం మనస్సే. అది ఎక్కడ పుడుతుందో వెదికి దాని విజృంభణను ఆపుచెయ్యటమే విచారణ. మదపుటేనుగు వంటి మనస్సును అదుపుకు, నేను ఎవండును? అనే ప్రశ్న అంకుంశం లాంటిది. అది బుద్ధిని సాక్షీభూతంగా ఉంచటానికి సహకరిస్తుంది. మన ముఖం అద్దంలో చూసుకొంటే మసి ఉంటే తొలగించుకోవచ్చును. మన మనో వికారాలను తెలుసుకొనే అద్దం ఒకటి ఉంది. విచారణ అనే అద్దం. అందులో మన ఆలోచనలు, ఉద్రేకాలు, బెంగలు, భయాలు, బాధలను చూచుకోవచ్చును. అవి స్ఫురించినప్పుడు ఇవి ఎవరికి అని ప్రశ్నిస్తే వాటిని శిలువవేసినట్లే. కారణం మనస్సు మనం కాము. మనం ఇతరులతో మాట్లాడేటప్పడు సహజంగా మాట్లాడుతున్నామా? ప్రయోజనం ఉండి మాట్లాడుతున్నామా? ప్రయోజనం లేకపోతే మొరటుగా, తృణీకారంగా మాట్లాడుతున్నామా? అని గ్రహించాలి. మరి ఒకరితో భయం వల్ల మర్యాదగా వారు వచ్చినప్పడు లేచి నిలబడి మాట్లాడుతున్నాము. అదే నౌకరు వస్తే పట్టించుకోము. ఆ అద్దంలో నన్ను నేను ఇలా గమనించుకొంటే ఇతరులకు ఎంత కృత్రిమమైన గౌరవం ఇస్తున్నాము అని తెలిసిపోతుంది. మనం అహంకారంతో మాట్లాడకూడదు. ఎవరైనా అలా మాట్లాడితే అందులో కలిసిపోకుండా దాని పోకడలను గమనించాలి. శ్రీ నాన్నగారు "అబ్జర్వేషన్ వల్ల కూడా నాలడ్జి వస్తుంది. సుప్రీమ్ స్టేజ్ (ఆత్మనుంచి) జారిపోతే మనస్సు అనే అడవిలో పడిపోతాము" అన్నారు. వస్తు రహితంగా, విజయ రహితంగా కేవలం చైతన్యం ఉంది. నేను వింటున్నాను, చూస్తున్నాను, ఆలోచిస్తున్నాను అనేవి మనో బుద్ధులతో తాదాత్మ్యం వల్లనే అని గ్రహించాలి. విషయాలు గుర్తించినప్పడు వాటికంటే నేను వేరని తెలుసుకోవాలి. అవి చైతన్యం సమక్షంలో తెలియబడుతున్నాయని గ్రహించాలి. నేను కర్తను అనే విషసర్పం కాటుతో అశాంతితో ఉన్నాము. వాటికి విరుగుడు నేను సాక్షిని అనే అమృతాన్ని తాగి సుఖంగా ఉండాలి. ఈ విచారణ వల్ల ఊరుతూ ఉండే మనస్సు ఊరక ఉంటుంది. అప్పడు గురువు ఆత్మ పెట్టె "కీ" మనకు ఇస్తారు. ఆ అనంద సంపదకు వారసులౌతాము.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం